## క్లుప్తంగా

### ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

**మంచాల:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1993–94పదవ తరగతి బ్యాచ్ 30 సంవత్సరాల తరువాత ఆదివారం కలుసుకున్నారు. గత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఒకరినొకరు ఆప్యాయతగా పలకరించుకుని సంతోషంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

### సురేష్‌కు సన్మానం

**తలకొండపల్లి:** మండల పరిధిలోని చీపునుంతలకు చెందిన వంకూరి సురేష్‌ను సర్పంచ్ బండి రఘుపతి ఆదివారం ఘనంగా సన్మానించారు. పేద కుటుంబంలో పుట్టిన సురేష్ జుడీషియల్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని ఉద్యోగం సాధించినందుకు సర్పంచ్ రఘుపతి శాలువాతో సురేష్, అతని తల్లిదండ్రులను సన్మానించారు. సురేష్‌ను స్ఫూర్తిగా తీసుకొని యువత రాణించాలన్నారు. కార్యక్రమంలో మల్లేష్, పెంటయ్య, గిరి, కృష్ణ, నర్సింహ, పర్వతాలు పాల్గొన్నారు.

### వృద్ధులకు సన్మానం



వృద్ధులను సత్కరిస్తున్న ఆర్డీఓ అనంతరెడ్డి

**ఇబ్రహీంపట్నం:** వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వృద్ధులను ఆర్డీఓ అనంతరెడ్డి సత్కారించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పూలమాలలు వేసి శాలువా కప్పి వారిని సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అన్వర్, డీటీ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

### నూతన నియామకం



నియామక పత్రం అందుకుంటున్న మహేశ్

**ఇబ్రహీంపట్నం:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఖానాపూర్‌కు చెందిన పి.మహేశ్‌ను నియమించారు. ఈ మేరకు పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా ఆదివారం నియామక పత్రం మహేశ్ అందుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన వారి ఆశలు వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శాయశక్తుల కృషిచేస్తానని తెలిపారు.

**కాంగ్రెస్ పార్టీలో చేరికలు**

మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో ఆదివారం ఇబ్రహీంపట్నంకు చెందిన ముస్లిం మైనార్టీలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.

### ముదిరాజ్ భవనానికి నిధుల మంజూరు



నిధుల మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

**యాచారం:** మండలంలోని తక్కళ్లపల్లి ముదిరాజుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిధుల మంజూరు ఉత్తర్వుల పత్రాన్ని గ్రామానికి చెందిన ముదిరాజులకు అందజేశారు. వివిధ కులాల ఆర్థిక ప్రగతి, కమ్యూనిటీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉండాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భాషా, ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, సర్పంచ్ సంతోష, నాయకులు యాదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నాయకుల అరెస్ట్

**ఆమనగల్లు:** పట్టణంలో మంత్రి హరీశ్‌రావు పర్యటన ఈ సందర్భంగా ఆదివారం పలువురు కాంగ్రెస్ నాయకులను పోలీసులు దస్తుగా అరెస్టు చేశారు. మంత్రి పర్యటన అనంతరం విడిచిపెట్టారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్, నాయకులు కృష్ణానాయక్, శ్రీశైలం, అలీం, సురేశ్‌నాయక్, శ్రీకాంత్, ఫరీద్, సురేశ్, శ్రీదర్, రవీందర్ ఉన్నారు.

# పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- పీడిస్తున్న దోమలు. ఈగలు, పందుల బెడద!
- రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు

మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. దోమలు, ఈగలు, పందులు స్వైర విహారం చేయడంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణపై పలు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు మండిపడుతున్నారు. కాలనీల్లో చెత్త కుప్పలు కుప్పలుగా ఉండడం, మురుగు కాల్వలలో నుంచి వచ్చే దుర్వాసనతో తట్టుకోలేక పోతున్నామని ప్రజలు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



లోయపల్లిలో దుర్వాస వెదజల్లుతున్న మురికి కాల్వ



ఇళ్లకు సమీపంలో చెత్తా చెదారం

**మంచాల:** వరుస వర్షాలతో పరిశుద్ధ్య పడకేసింది. ఈగలు, దోమల బెడద విపరీతంగా పెరిగి, విషజ్వరాలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య పరిష్కారించే నాథుడే కరువైయ్యాడు. మంచాల మండలంలోని మేజరు గ్రామ పంచాయతీల్లో ఆరుట్ల, లోయపల్లి గ్రామంలో పారిశుద్ధ్య సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇళ్ల మధ్య మురుగు నీటి కాల్వ చెత్తా చెదారంతో నిండిపోయింది. కొన్ని వార్డుల్లో ఇళ్ల మధ్య, రోడ్లపై నీరు నిలిచి రాకపోకలు ఇబ్బందిగా మారింది. పాఠశాల సమీపంలో మురుగు నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. కొన్ని నెలలుగా ఇదే తంతు కొనసాగుతున్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. గ్రామంలోని ఇళ్లకు సమీపంలో చెత్తా చెదారం కుప్పలు ,కుప్పలుగా వేయడంతో పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఓవైపు ప్రభుత్వ 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో చెత్తను తొలగిద్దాం – స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుదామని చెబుతోంది. ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. ఇప్పటికైనా గ్రామంలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



### పట్టించుకునే నాథుడు లేడు..

గ్రామంలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. ఈగలు, దోమలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలు విషజ్వరాల బారిన పడే ప్రమాదం ఉంది. తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– గంపల్లి లక్ష్మమ్మ (వార్డు సభ్యురాలు) లోయపల్లి

### ఆరు నెలలుగా జీతాలు లేవు

గ్రామ పంచాయతీ కార్మికులకు గత ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. మే నెల నుంచి రూ. వెయ్యి పెంచి వేతనాలు అందిస్తామన్నారు. నేటికీ ఇవ్వలేదు. పంచాయతీ కార్మికులు పనులు చేయించుకోవడం తప్ప వారి బాగోగుల పట్టించుకోవడం లేదు. తక్షణమే జీతాలు చెల్లించాలి.

– ఖాజాపాష ( కారోబార్) లోయపల్లి



# పరిశుభ్రత మనందరి బాధ్యత

**మంచాల:** పరిసరాల పరిశుభ్రత ప్రజలందరి బాధ్యతని మంచాల సర్పంచ్ అనిరెడ్డి అన్నారు. ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మంచాల బాలికల వసతి గృహం ఆవరణలో శ్రమదానం చేశారు. చెత్తా చెదారం తొలగించి, పిచ్చి మొక్కలను తీసివేశారు. గ్రామంలోని ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని కోరారు.

**'స్వచ్ఛతా హీ సేవా' విజయవంతం**

**తుర్కయంజాల్:** పురపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డులో ఆదివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం విజయవంతం అయిందని పుర కమిషనర్ సీ.హెచ్. శ్రీకాంత్ పేర్కొన్నారు. మన్నెగూడలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ రఘునందన్‌గౌడ్, కౌన్సిలర్లు మర్రి మాధవి, తదితరులతో కలిసి శ్రమదానం చేశారు. అన్ని వార్డుల్లో పరిసరాల పరిశుభ్రత, మురుగు నీటి కాల్వలను శుభ్ర చేయించడం, దేవాలయాలు, అంగన్‌వాడీలు, పబ్లిక్ టాయిలెట్స్, పలు కాలనీల్లో రోడ్లను శుభ్రం చేయించినట్లు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీధర్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నాగేష్, శేఖర్‌రెడ్డి, పలువురు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**చీపురు చేతపట్టి..**

**హయత్‌నగర్:** స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని ప్రజాప్రతినిధులు, అధికారులు చీపురు చేతపట్టి పరిసరాలను శుభ్రం చేశారు. మున్సిపాలిటీ చైర్‌పర్సన్ స్వప్న, వైస్ చైర్‌పర్సన్ సంపూర్ణారెడ్డిలు 24వ వార్డులో బస్టాండ్, అంగన్‌వాడీ సెంటర్ , ప్రభుత్వ పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు.

**ప్రభుత్వాసుపత్రిలో 'స్వచ్ఛతా హీ సేవా'**

**ఇబ్రహీంపట్నం:** స్వచ్ఛత హీ సేవా లీగ్ 2.0లో భాగంగా ఏక్ తారీఖ్, ఏక్ గంటా, ఏక్ సాథ్ ప్రోగ్రాంలో భాగంగా ఆదివారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాసుపత్రిలోని చెత్తచెదారాన్ని తొలగించి ఎన్ఎస్‌జీ కమాండోలు శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ పరిశుభత్రను పాటించి, పర్యావరాణాన్ని కాపాడాలని వారు కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్, ఎన్‌జీఓలు పాల్గొన్నారు..

**కాలుష్యరహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదాం**

**ఇబ్రహీంపట్నం:** కాలుష్య రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ సహకరించాలని కౌన్సిలర్ భర్తకి జగన్ అన్నారు. ఇబ్రహీంపట్నం 3వ వార్డులో ఆదివారం శ్రమదాన కార్యక్రమం నిర్వహించి చెత్తచెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెత్తచెదారం, ప్లాస్టిక్, వ్యర్థాలతో వెలువడే కాలుష్యంతో ప్రజలు అనారోగ్యానికి గురికావడమే కాకుండా దోమలు, ఈగలు వ్యాప్తి చెందుతాయన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఇళ్ల వద్దకు వచ్చే వాహనాల్లోనే చెత్తను వేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రమేష్, యాదగిరి, కాలనీ వాసులు జంగయ్య, విజయ్, హంసమ్మ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



శ్రమదానంలో పాల్గొన్న కమిషనర్, ఆర్డీఓ తదితరులు

# అక్రమ అరెస్టులకు భయపడం

- 100 పడకల ఆస్పత్రి, జూనియర్ కళాశాల సాధించి తీరుతాం
- కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు

**కడ్తాల్:** మండల కేంద్రంలో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి , జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కాంగ్రెస్ పార్టీ, ఎన్ఎస్‌యూఐ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షను, మంత్రి హరీశ్ రావు పర్యటన నేపథ్యంలో పోలీసులు భగ్నం చేశారు. కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యయుతంగా మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి, జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని, ప్రజల పక్షాన, విద్యార్థుల పక్షాన శాంతియుతంగా రిలే నిరాహార దీక్షలు చేస్తుంటే పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రతిపక్ష పార్టీగా ప్రజల కోసం పోరాడుతుంటే అక్రమంగా కేసులు పెట్టి అరెస్ట్‌లు చేయడం ఎంత వరకు సమంజసమని ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుల అక్రమ అరెస్ట్‌లకు, కేసులకు నిరసనగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్, ఎన్ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు షాబుద్దీన్, భానుకిరణ్, రాజేశ్, రవి,, రాజేందర్, తుల్సీరాం, ప్రవీణ్, దర్శన్, క్రాంతి, చందు, ఇద్రీస్, కల్యాణ్, వంశీ,విజయ్‌రాథోడ్ పలువురు నాయకులు ఉన్నారు.



కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

### ముగిసిన వర్క్‌షాప్

**అబ్దుల్లాపూర్‌మెట్:** అన్నమాచార్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల సమన్వయంతో ఐదు రోజులుగా 'స్మార్ట్ ఇండియా హ్యాక్– 2023' పేరుతో నిర్వహిస్తున్న వర్క్‌షాప్ ముగిసింది. చివరి రోజు బ్రెయిన్ విజన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సహకారంతో 'పైథాన్‌తో డేటా సైన్స్' అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు నూతన సాంకేతికతను జోడించి పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు విద్యార్థులకు ఇలాంటి అవగాహన సదస్సులు ఎంతో దోహదపడతాయని కళాశాల చైర్మన్ గంగిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ శ్రీనివాస్‌రావు, రమేశ్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ రాజారావులతో పాటు అన్ని విభాగాల హెచ్‌ఓడీలు పాల్గొని విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

# ఆరోగ్య ఆదిబట్లగా తీర్చిదిద్దుదాం

**మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఆర్తికగౌడ్**

**ఇబ్రహీంపట్నం రూరల్:** ఆరోగ్య ఆదిబట్లగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ కొత్త ఆర్తికగౌడ్ పేర్కొన్నారు. ఆదివారం స్వచ్ఛ భారత్ మిషన్ –2023లో ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0లో భాగంగా గాంధీ జయంతిని పురస్కరించుకొని ఆదిబట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాన్ అంబేడ్కర్ చౌరస్తాలో 'స్వచ్ఛతా హీ సేవా' కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఆర్తకతో పాటు కమిషనర్ అమరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ మహేందర్‌లు చీపురు పట్టి రోడ్లను శుభ్రం చేశారు. చెత్త చెదారం సిబ్బందితో కలిసి ఎత్తివేశారు. ఈ సందర్భంగా ఆర్తికగౌడ్ మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తయారు చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేద్దామన్నారు. పట్టణంలో చెత్త , ప్లాస్టిక్ నివారణ చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రతి రోజు టన్నుకు పైగా చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నామని తెలిపారు. పౌరులు పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలని సూచించారు. నిరంతరం సిబ్బంది, అధికారులే కాకుండా పుర ప్రజల భాగస్వామ్యంతో ఎదైనా సాధించవచ్చని వివరించారు. అలాగే, ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో ఆరోగ్యాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దోమల నివారణకు మందులు వేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఆదిబట్ల మున్సిపాలిటీ మేనేజర్ శ్రీనివాస్, సిబ్బంది అశోక్, సురేశ్, సదానందం, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న చైర్‌పర్సన్ ఆర్తిక, కౌన్సిలర్ మహేందర్

# ఫార్మా అక్రమాలపై విచారణ చేయిస్తాం

**మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**

**యాచారం:** రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మాసిటీ భూసేకరణ, పరిహారం చెల్లింపులో అక్రమాలపై విచారణ చేయిస్తామని మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. తాడిపర్తి, కుర్మిద్ద, గునుగల్ తదితర గ్రామాల నుంచి వివిధ పార్టీలకు చెందిన వందమంది కార్యకర్తలు ఆదివారం నగరంలోని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ సర్కార్ ఫార్మాసిటీని రియల్ వ్యాపారంగా మార్చుకుందన్నారు. భూసేకరణలో, పరిహారం చెల్లింపులో అధికార పార్టీ నేతలు, అధికారులకు అనేక అక్రమాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. ఫార్మాసిటీని రద్దు చేసి రైతుల భూములు రైతులకే ఇచ్చేస్తామని అన్నారు. నందివనపర్తి గ్రామంలోని ఓంకారేశ్వరాలయానికి చెందిన 1,400 ఎకరాలకు పైగా భూముల్లో ఆయా గ్రామాలకు చెందిన పేద రైతులు ఏళ్లుగా కౌలు చేసుకుని జీవనోపాధి పొందుతున్నారని అన్నారు. అలాంటి రైతులకు న్యాయం చేసేది పోయి, ఆ భూములను కూడా నేడు సర్కార్ లాక్కోవాలని చూస్తుందని విమర్శించారు. ఫార్మాసిటీ భూబాధితులకు , ఓంకారేశ్వరాలయ కౌలు రైతులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కె. శ్రీనువాస్‌రెడ్డి, తాడిపర్తి సర్పంచ్ రమేష్, నల్లవెల్లి ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మీపతిగౌడ్ తదితరులు ఉన్నారు.



మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నేతలు

# శ్మశానవాటికకు ఆ స్థలం వద్దు

**మైనార్టీ నాయకుల వినతి**

**అబ్దుల్లాపూర్‌మెట్:** మండలంలోని మజీద్‌పూర్‌లో సర్వేనంబర్ 233లో ఉన్న ప్రభుత్వ భూమిని నగరానికి చెందిన మైనార్టీల శ్మశాన వాటికకు 20 ఎకరాలు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం జీఓ నం. 94ను జారీ చేసింది. తక్షణమే జీఓను రద్దు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ పోచంపల్లి సుధాకర్‌రెడ్డి, నాయకులు, గ్రామస్తులు ఆదివారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మైనార్టీ శ్మశాన వాటికకు కేటాయించిన భూమికి ఆనుకుని వ్యవసాయ భూములు, నివాస గృహాలు ఉన్నాయని, అలాంటి స్థలంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేయడం సరికాదన్నారు. జీఓను తక్షణమే రద్దు చేసి, ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, లేక డబుల్ బెడ్రూం ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బాటసింగారం సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి, ఎంపీటీసీ బాలమణి, ఉపసర్పంచ్ బాలకిషన్, మాజీ ఉపసర్పంచ్ జగన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు శ్రీశైలంగౌడ్, మహేందర్‌ముదిరాజ్, రాజారాంచారి, జంగయ్య, రాజేష్, ప్రదీప్, రవీందర్‌రెడ్డి, రమేష్‌లతో పాటు వార్డుసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

# ప్రజాగర్జనకు తరలిన బీజేపీ శ్రేణులు



ఆమనగల్లు: ర్యాలీలో బీజేపీ నాయకులు

**కడ్తాల్:** పాలమూరులో నిర్వహించనున్న ప్రధాని నరేంద్ర మోడీ ప్రజాగర్జన సభకు ఆదివారం మండల కేంద్రంతో పాటు, ఆయా గ్రామాల నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మాన్యానాయక్, నాయకులు సాయిలాల్‌నాయక్, రాందాస్‌నాయక్, పవన్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, అంజయ్యయాదవ్, మల్లేశ్, తదితరులు ఉన్నారు.

**ఆమనగల్లులో బీజేపీ భారీ ర్యాలీ**

**ఆమనగల్లు:** పాలమూరులో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజాగర్జన సభకు పట్టణం నుంచి ఆదివారం పెద్ద ఎత్తున బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఆచారి ఆధ్వర్యంలో ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాల నుంచి పెద్ద ఎత్తున వెళ్లారు. అనంతరం బీజేపీ నాయకులు బారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కండె హరిప్రసాద్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, బీజేపీ నాయకులు నర్సింహ, విజయ్‌కృష్ణ, శ్రీశైలంయాదవ్, లక్ష్మణ్ ఉన్నారు.

### మంత్రి హరీశ్‌రావుకు వినతి



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఆశలు

**ఆమనగల్లు:** ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో కలిసి వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మంత్రి హరీశ్‌రావుకు ఆశలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, మున్సిపల్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు.

# మండలం ప్రకటించే వరకు ఆందోళన

**తలకొండపల్లి:** గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలం ప్రకటించేంతవరకు దీక్షలు కొనసాగుతాయని జేఏసీ నాయకులు రేణురెడ్డి అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో వివిధ పార్టీల నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం 93వ రోజుకు చేరింది. రేణురెడ్డి మాట్లాడుతూ.. మండల ఏర్పాటుకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, వనరులు అన్ని ఉన్నాయన్నారు. 41 రోజులు దీక్షలు చేశామని, ప్రస్తుతం దీక్షలు చేపట్టి 91 రోజులుగా కొనసాగుతున్న ప్రభుత్వం కనీసం స్పందించడం లేదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి, రేణురెడ్డి, చంద్రయ్య, చెన్నయ్య, శివయ్య, పవన్ వాల్మీకి, జగన్, రాంరెడ్డి, మాణిక్యం, వెంకటయ్య, వెంకటేష్, శ్రీను, ఈదమయ్య పాల్గొన్నారు.



నిరాహార దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు

### జేఎల్ఎంగా కారోబార్

**యాచారం:** మండలంలోని మాల్ పంచాయతీలో కారోబార్‌గా విధులు నిర్వర్తిస్తున్న బట్టు లింగంకు విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్‌గా ఉద్యోగం వచ్చింది. లింగం మాల్ గ్రామ పంచాయతీ కారోబార్‌గా గత పదేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధులు నిర్వర్తిస్తూ నే డిగ్రీతో పాటు ఐటీఐ పూర్తి చేశాడు. టీఎస్ఎస్ పీడీసీఎల్‌లో ఖాళీల పోస్టులకు పరీక్ష రా యగా తాజాగా ప్రకటించిన ఫలితాల్లో లైన్‌మెన్‌గా ఉద్యోగం పొందాడు. లింగాన్ని ఆదివారం స్వచ్ఛంద కార్యకర్త మురళి సత్కరించారు.

# 'గ్యారంటీ' తో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

**ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి**

**తలకొండపల్లి:** రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సోనియా గాంధీకి బహుమతిగా ఇవ్వాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తుక్కుగూడ సభలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలతో కాంగ్రెస్ పార్టీకు పూర్వ వైభవం రానుందని పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మెదక్‌పల్లిలో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి నేరుగా ప్రజలను కలుసుకున్నారు. కాంగ్రెస్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌కు రెండు కళ్లులాంటివన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తాని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ వైపు ఆకర్షితులవుతున్నారని, దీంతో కల్వకుర్తిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శులు అంజయ్యగుప్తా, రవీందర్‌యాదవ్, సోషల్ మీడియా అసెంబ్లీ కన్వీనర్ అజీం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కిసాన్ సెల్ నాయకులు విష్ణు, డిగ్రీ కృష్ణ, మాజీ ఎంపీటీసీ రాములు, డేవిడ్, ఆరీఫ్, యూత్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, వెంకటయ్య, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



ఇంటింటికి కాంగ్రెస్‌లో ప్రభాకర్‌రెడ్డి, నాయకులు

**కాంగ్రెస్ గెలుపునకు కృషి**

**మంచాల:** కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కష్టపడి పని చేయాలని ఇబ్రహీంపట్నం బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎదుళ్ల పాండు రంగారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తిప్పాయిగూడలో నిర్వహించిన ఇంటింటికి కాంగ్రెస్‌పార్టీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే 100 రోజుల్లో ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. రాష్ట్రంలో అవినీతి , అక్రమాలకు నిలయంగా మారిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చి వేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళ అధ్యక్షురాలు జయమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, కన్వీనర్ నరేందర్‌రెడ్డి, నాయకులు సంతోష్‌కుమార్, హన్మంత్‌రెడ్డి, వాజీద్, జయానందం, రాందాస్, ప్రేమాకర్‌రెడ్డి, శ్రీధర్, మల్లేష్ పాల్గొన్నారు.